కంది సాగు.. లాభాలు బాగు

- పప్పు దినుసుల సాగుపై రైతులు దృష్టి సారించాలి
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు
- కృషి విజ్ఞాన కేంద్రం రంగారెడ్డి జిల్లా ప్రధాన శాస్త్రవేత్త చంద్రకాంత్, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ గొల్లపల్లి రత్నాకర్
- రేగడిదోస్వాడలో కంది పంట క్షేత్ర దినోత్సవం

సమావేశంలో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం రంగారెడ్డి జిల్లా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చంద్రకాంత్

షాబాద్, ఫిబ్రవరి 6 : గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు పప్పు దినుసుల సాగుపై దృష్టి సారించాలని కృషి విజ్ఞాన కేంద్రం రంగారెడ్డి జిల్లా ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చంద్రకాంత్, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ గొల్లపల్లి రత్నాకర్ అన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని రేగడిదోస్వాడ గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం రంగారెడ్డి జిల్లా, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంది పంట క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. పప్పు దినుసుల సాగు ప్రోత్సాహంలో భాగంగా రేగడిదోస్వాడలో ప్రథమ శ్రేణి క్షేత్ర పథకంలో భాగంగా రైతులకు అధిక దిగుబడినిచ్చే టీడీఆర్‌జీ-59 తెలంగాణ కంది-3రకం విత్తనాలు అందజేసి సాగు చేయించామన్నారు. ఈ సందర్భంగా చంద్రకాంత్ మాట్లాడుతూ... కందిపంట సాగులో యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. పప్పు దినుసుల సాగు కోసం కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా చేపడుతున్న కార్యక్రమాలను రైతులకు వివరించారు.

రైతుల సేవలపై అవగాహన

వ్యవసాయశాఖ చేవెళ్ల డివిజన్ ఏడీఏ సురేశ్ బాబు మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ గొల్లపల్లి రత్నాకర్ మాట్లాడుతూ... రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేయించి పంటల సాగుపై అన్నదాతలకు అవగాహన కల్పిస్తామన్నారు. భూసార పరీక్షల ద్వారా రైతులు విధిగా తమ నేల పరీక్షలు జరిపించి, పోషక లోపాలు సరి చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు నేలను సారవంతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. పశువుల ఎరువు, పచ్చిరొట్ట పైర్లు వేసి భూమిలో కలియదున్నడం, జీవన ఎరువులు, చెరువు మట్టి తదితర వాటితో రైతులు తమ పొలాలు సారవంతం చేస్తే మొక్కలు ఆరోగ్యంగా పెరిగి ఆశించిన దిగుబడి పొందే అవకాశం ఉందని తెలిపారు. ఫౌండేషన్ ద్వారా జిల్లాలో రైతులకు అందిస్తున్న సేవలపై వివరించారు. కార్యక్రమంలో టెక్నికల్ అధికారి రామకృష్ణ, డాక్టర్ గౌతమ్ చౌహాన్, మండల వ్యవసాయశాఖ అధికారి వెంకటేశం, సాయి వర్ధన్, సాయికుమార్, రైతులు అనంతరెడ్డి, మల్లారెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, మాధవ రెడ్డి, సురేశ్, రఘు, మధుసూదన్‌రెడ్డి, మాణిక్యం తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో సన్నద్ధం కావాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్
- పది పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

ధారూరు, ఫిబ్రవరి 6 : విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరయ్యేలా సన్నద్ధం కావాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. గురువారం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి వసతి గృహ విద్యార్థినీ, విద్యార్థులకు వికారాబాద్‌లోని అంబేద్కర్ భవన్‌లో ప్రేరణ, శిక్షణా తరగతులు నిర్వహించారు. పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు వివిధ పాఠ్యాంశాలపై శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల్లో మనోధైర్యం, వ్యక్తిగత నైపుణ్యాన్ని పెంచేందుకు ని ష్ణాతులైన ఉపాధ్యాయులు సునీత మేరీ, మా ధవాచారి, వేణుగోపాల్, ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రేరేపకులు కె.రామచంద్రుడు, కె.మాధవి, మహేందర్, ఉదయ్‌కుమార్, గోపీనాథ్, రమేశ్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులకు పరీక్షల మెటీరియల్ అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. పరీక్షలు అతి సమీపంలో ఉన్నందున సమయం వృథా చేయకుండా ప్రతి సబ్జెక్టులో తమ నైపుణ్యాన్ని మెరుగు పరచు కోవాలన్నారు. పాఠ్యాంశాలను సులభతరంగా అర్థం చేసుకొని అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసేలా సన్నద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు జీవితంలో ఒక లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. చదువుతో మీ భవిష్యత్తును మార్చుకొని మీ తల్లిదండ్రులు గర్వించేలా మంచి గుర్తింపును తెచ్చుకోవాలని సూచించారు. వసతి గృహాల్లో చదవుకున్న విద్యార్థులందరూ పేదరికం నుంచి వచ్చిన వారన్నారు. అతి పేద కుటుంబంలో జన్మించిన అబ్రహం లింకన్, డాక్టర్ బాబాసాహెబ్ లాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి మల్లేశం, సహాయ సంక్షేమ అధికారి ఉమాపతి, వీరానందం, శుక్రవర్ధన్ రెడ్డి, వసతి గృహాల సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగపూర్ సర్వేలో పాల్గొన్న ప్రొఫెసర్

సింగపూర్ సోషియా ఎకనామిక్ మైక్రో సర్వేలో డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 6 : సింగపూర్‌లోని సింగపూర్ యూనివర్సిటీ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లో సస్టైనబుల్ ఇండియా భాగస్వామ్యంతో అంతర్జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నారు. ఈ సెమినార్‌కు వెళ్లి సింగపూర్‌లో సోషియో ఎకనామిక్ మైక్రో సర్వే చేసినట్లు ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సామ రవీందర్‌రెడ్డి గురువారం తెలిపారు. సింగపూర్‌లోని ప్రభుత్వం నిర్మించిన హౌసింగ్ డెవలప్‌మెంట్ బోర్డుకు వెళ్లి సంక్షిప్త సర్వేలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సర్వేలో ఆదాయం తక్కువగా ఉన్న సింగపూర్ పౌరులు ఎలాంటి జీవనం గడుపుతున్నారు.. వారికి ఉన్న స్కూల్, వైద్య సౌకర్యాలు, ఉద్యోగ నేపథ్యం, నెలసరి ఆదాయం తదితర వాటిపై మైక్రో సర్వే నిర్వహించామన్నారు. అక్కడ ప్రభుత్వమే అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నదని, పొల్యూషన్ ఫ్రీగా ఉంటుందని చెప్పడంతో పాటు 30 ఏండ్లు దాటిన వారికి ప్రభుత్వమే రుణ సౌకర్యం అందించి స్థిరపడేలా ప్రోత్సహిస్తున్నదని స్థానికులు తెలిపినట్లు వివరించారు. తెలంగాణ నుంచి తనకు మైక్రో సర్వే చేయడానికి అవకాశం కలగడం సంతోషంగా ఉందన్నారు. శుక్రవారం సెమినార్‌లో తన ప్రెజెంటేషన్‌తో పాటు సర్వే రిపోర్ట్ వివరిస్తానన్నారు. కార్యక్రమంలో సింగపూర్ యూనివర్సిటీ అధ్యాపకుడు తామ్స్, ఇతర ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

శివభక్తులకు ముస్లింల అన్నదానం

కేశంపేట, ఫిబ్రవరి 6 : నియమనిష్టలతో పూజలు చేస్తున్న శివ భక్తులకు ముస్లిం సోదరులు అన్నదానం చేసి మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నారు. కేశంపేట మండల పరిధిలోని వేముల్‌నర్వ ముస్లింలు గ్రామంలో శివ మాలను ధరించిన భక్తులకు గురువారం అన్నదానం చేసి మన్ననలు పొందుతున్నారు. ఈ సందర్భంగా మైనార్టీలు ఎండీ మహ్మద్, సల్వార్, అఫీజ్, జాంగీర్‌బాబా, ఇమ్రాన్ మాట్లాడుతూ.. శివభక్తులకు అన్నదానం చేయడం తమ గతజన్మ పుణ్యమని, లోక కల్యాణం కోసం నియమ నిష్టలతో శివ భక్తులు పూజలు చేయడం సంతోషకరమన్నారు. గురుస్వాములు బంటారం రాజుగౌడ్, ఆలుగొండ శ్రీనయ్య ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివనామస్మరణ జపించారు. కార్యక్రమంలో శివ భక్తులు మహేశ్, శివ, అశోక్, భిక్షపతి, వేణు, రామస్వామి, శ్రీకాంత్, వినోద్, నర్సింహులు, గ్రామస్తులు ఆనంద్‌రెడ్డి, మనోహర్‌గౌడ్, కావలి కృష్ణ, మంగలి శేఖర్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వేముల్‌నర్వలో శివభక్తులకు అన్నదానం చేస్తున్న ముస్లింలు

బీసీల రిజర్వేషన్లపై చట్టం చేయాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ

అభివాదం చేస్తున్న బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, గొరిగే మల్లేశ్, వేముల రామకృష్ణ

రవీంద్రభారతి, ఫిబ్రవరి 6: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణన గణాంకాలు పూర్తి అసత్యంగా ఉన్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అన్నారు. బీసీల పొట్ట గొట్టి, ఓసీలను పెంచి పోషించేందుకే రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు రిపోర్ట్ ఇచ్చిందని ఆరోపించారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ, రాష్ట్రంలో బీసీల జనాభా 56 శాతం ఉందని, 1978 నుంచి చేసి ప్రతి సర్వేలో తేలిందని, కాని, 10 శాతాన్ని కోతపెట్టి 46 శాతంగా లెక్కలు చూపిస్తున్నారని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. 6.5 శాతం ఉన్న ఓసీలను మాత్రం 16 శాతం చూపిస్తూ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడుకునేందుకు లెక్కల గారడి చేశారని విమర్శించారు. కుల గణనలో బీసీల జనాభా తగ్గింపు అంశంపై సవరణకై కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీల రిజర్వేషన్లపై అసెంబ్లీలో చట్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీలను మోసం చేసే పార్టీలకు మనుగడ ఉండదని, రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీసీలు బొందపెట్టడం ఖాయమన్నారు. జాతీయ కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ప్రతిరోజు ఓబీసీల కుల గణన చేయాలని దేశ వ్యాప్తంగా ప్రచారం చేస్తుంటే, తెలంగాణ రాష్ట్రంలో మాత్రం సీఎం రేవంత్ రెడ్డి బీసీల జనాభా లెక్కలు తగ్గించి మరోమారు బీసీలకు కాంగ్రెస్ పార్టీ ద్రోహం చేసిందన్నారు. తక్షణమే ప్రభుత్వం మళ్లీ కుల గణనను రీసర్వే చేయించి 42 శాతం రిజర్వేషన్లను చట్టం చేసిన తరువాత స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్ళాలని ఆయన డిమాండ్ చేశారు. లేకుంటే కాంగ్రెస్ పార్టీకి బీసీల దెబ్బ ఎట్లా ఉంటదో చూపిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో గొరిగే మల్లేశ్, వేముల రామకృష్ణ, కోలా జనార్ధన్, సుధాకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాటకం... బీసీల గణన బూటకం

బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్

తాండూరు, ఫిబ్రవరి 6 : రాష్ట్ర ప్రజలకు మోస పూరిత హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినట్టే బీసీల కుల గణన కూడా బూటకమైందని బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. గురువారం తాండూరులో శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. 2014 సమగ్ర కుటుంబ సర్వేలో 51 శాతం ఉన్న బీసీలు ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ విడుదల చేసిన సర్వేలో 46 శాతం ఉండడమేమిటని ప్రశ్నించారు. ముమ్మాటికీ ఇది దుర్మార్గమైన చర్య అన్నారు. ఓసీల సంఖ్యను రెట్టింపు చేసి బీసీ, ఎస్సీ, ఎస్టీల సంఖ్యను గణనీయంగా తగ్గించి చూపడం చాలా బాధకరమన్నారు. ఈడబ్ల్యూస్ రిజర్వేషన్లు కాపాడేకుట్ర చేస్తూ కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుందన్నారు. ప్రస్తుతం నడుస్తున్న కాంగ్రెస్ పాలన రెడ్డీల రాజ్యంగా కొనసాగుతుందన్నారు. పార్టీల పరంగా మేము 42 శాతం టికెట్లు ఇస్తాం.. అన్నీ పార్టీల వారు 42 శాతం టికెట్లు ఇవ్వాలని సీఎం అనడం విడ్డూరంగా ఉందన్నారు. బిహార్ తరహా తెలంగాణలో చట్టబద్ధతతో కూడిన రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

భారతదేశ సిద్ధాంతాలు ఎంతో గొప్పవి

కోజికోడ్ ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ దెబాషిస్ ఛటర్జీ

మాట్లాడుతున్న కోజికోడ్ ఐఐఎం డైరెక్టర్ ప్రొఫెసర్ దెబాషిస్ ఛటర్జీ, పాల్గొన్న ప్రముఖులు

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 6 : పురాతనమైన భారత దేశ సిద్ధాంతాలు ఎంతో గొప్పవని, వీటిలో చాలా వాటిని జపాన్ లాంటి అభివృద్ధి చెందిన దేశాలు పాటిస్తున్నాయని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్ మెంట్, కొజికోడ్ డైరెక్టర్ ప్రొఫెసర్ దెబాషిస్ ఛటర్జీ స్పష్టం చేశారు. గురువారం శంకర్‌పల్లి మండల పరిధిలోని దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ పౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ విశ్వవిద్యాలయం (ఐబీఎస్) ప్రాంగణంలో వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. సంస్కృతులు, భాషలు ఎంతో విజ్ఞానాన్ని అందిస్తాయని, అవి అంతర్జాతీయ స్థాయికి ఏ మాత్రం తీసుపోవన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో పేరొందిన బహుళ జాతి సంస్థలన్నీ భారతీయుల నేతృత్వంలో నడుస్తున్నాయని గుర్తు చేశారు. నాయకుడికి ప్రత్యేకమైన పంథా ఏమీ ఉండదని, తన అనుచరులను ప్రోత్సహిస్తూ వారి అభివృద్ధికి తోడ్పడే వారే నిజమైన లీడర్ అని అభిప్రాయపడ్డారు. రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్, ఇక్ఫాయ్ చాన్స్‌లర్ డాక్టర్ సి.రంగరాజన్ వర్చువల్గా ప్రసంగిస్తూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఒక దేశం మరో దేశం నుంచి నేర్చుకునేందుకు సంకోచించరాదని సూచించారు. ఆరోగ్యకరమైన వాతావరణంలో ముందుకు సాగి అభివృద్ధి పంథా వైపు పయనించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఇక్ఫాయ్ వైస్ చాన్స్‌లర్ ఎల్ఎస్ గణేశ్, ఇక్ఫాయ్ సంస్థ విశిష్ట సలహాదారు మహేందర్ రెడ్డి, ఇక్ఫాయ్ సొసైటీ వైర్ పర్సన్ శోభారాణి యశస్వీ, హెచ్ సీయూ వైస్ చాన్స్‌లర్ బీజే రావు, ఐబీఎస్ మాజీ డీన్ రామ్మోహన్ రావు, ఐఎంఐ మొబైల్ ఫౌండర్, జిడ్డు కృష్ణమూర్తి ఫౌండేషన్ సెక్రటరీ విశ్వనాథ్ అల్లూరి, రిజిస్ట్రార్ విజయ లక్ష్మి, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీఆర్ఏల అక్రమ అరెస్టు తగదు

వీఆర్ఏల అక్రమ అరెస్టు తగదని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద వీఆర్ఏల నిరసనకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లా డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు జీవో 81, 85 తీసుకొస్తే సర్కార్ వాటిని పట్టించుకోవడంలేదన్నారు. వీఆర్ఏల కుటుంబాలకు ఉద్యోగాలిస్తామని మాట ఇచ్చి 14 నెలలు గడుస్తున్నా సీఎం రేవంత్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. నిరసనలో సీఐటీయూ నాయకుడు మహిపాల్, జేఏసీ జిల్లా కార్యదర్శి సంగమేశ్, జనార్దన్, శ్రీనివాస్, సంగమేశ్ తదితరులు పాల్గొన్నారు.

-వికారాబాద్, ఫిబ్రవరి 6

రాంగ్ పార్కింగ్ @ రూ.1500!

రోడ్డుకు దూరంగా కారు పార్కింగ్

మొయినాబాద్, ఫిబ్రవరి 6 : కారు రాంగ్ పార్కింగ్ చేశారని ట్రాఫిక్ పోలీసులు రూ.1500 చలానా విధించారు. మొయినాబాద్ మండల పరిధిలోని కనకమామిడికి చెందిన మర్రి రవీందర్‌రెడ్డి గురువారం పని నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. టీఎస్07 జీఈ4341 కారును హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారికి దూరంలో పోలీసు స్టేషన్ ఎదుట పార్కింగ్ చేసి స్టేషన్‌లోనికి వెళ్లారు. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులు కారు రాంగ్ పార్కింగ్‌లో పెట్టారని రూ.1500 చలానా విధించారు. రాంగ్ పార్కింగ్ చేస్తే ట్రాఫిక్ నిబంధనల ప్రకారం రూ.200 నుంచి రూ.300 వరకు చలానా వేస్తారు. వీరు అత్యుత్సాహంతో అదనపు చలానాను విధించారని వాహనదారుడు రవీందర్‌రెడ్డి ట్రాఫిక్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1500 చలానా ఎలా వేస్తారని ప్రశ్నించారు. పోలీస్ స్టేషన్ నుంచి బయటకు వచ్చే సరికి ట్రాఫిక్ పోలీసులు ఫొటో తీసి చలానా విధించారని, ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం వచ్చిందని తెలిపారు.

నులిపురుగుల నివారణకు మాత్రలు తప్పనిసరి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

ధారూరు, ఫిబ్రవరి 6 : ఒకటి నుంచి 19 ఏండ్లలోపు పిల్లలందరికీ నులి పురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు తప్పనిసరిగా వేసేలా ఏర్పాట్లు చేసుకోవాలని వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్ సూచించారు. ఇందు కోసం అన్ని శాఖలతో పాటు విద్యా శాఖ సమన్వయంతో ప్రణాళికలు రూపొందించుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ నెల 10న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ అదేశాల మేరకు గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ కలెక్టర్ కార్యాలయంలో వివిధ శాఖల సమన్వయం కోసం జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఒకటి నుంచి 19 ఏండ్లలోపు పిల్లలు 2,34,622 మంది ఉన్నారని తెలిపారు. పిల్లలందరికీ నులి పురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మేము ఎలా బతకాలి

- 9 నెలలుగా అందని వేతనాలు
- చిల్డ్రన్ హోం ఎదుట సిబ్బంది ధర్నా

చిల్డ్రన్ హోం ఎదుట ధర్నా చేస్తున్న సిబ్బంది

తుర్కయాంజాల్, ఫిబ్రవరి 6 : తొమ్మిది నెలలుగా అందని వేతనాలతో తాము ఎలా బతకాలని, కుటుంబం గడవని పరిస్థితి నెలకొన్నదని చిల్డ్రన్ హోం సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కమ్మగూడలో రంగారెడ్డి జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ హోం కొనసాగుతున్నది. ఇక్కడ పని చేసే సిబ్బందికి తొమ్మిది నెలలుగా వేతనాలు రాకపోవడంతో గురువారం హోం ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేతనాలు అంద క తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని.. ఈ విషయాన్ని పలు మార్లు మహిళా, శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి దృష్టికి తీసుకెళ్తే.. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాలేదని, అవి రాగానే చెల్లిస్తామని చెప్పారన్నారు. వేతనాలు రాకపోవడంతో కొన్నిరోజు లుగా నైట్ వాచ్‌మన్ విధులకు రావడం లేదన్నారు. చిల్డ్రన్ హోంలో పని చేసే సిబ్బందికి ప్రస్తుతం రోజువారీగా వేతనంగా చెల్లిస్తున్నామని.. త్వరలో అర్హత మేరకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తీసుకుంటామని జిల్లా అధికారి 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. ధర్నాలో పాల్గొన వారిలో అకౌంటెంట్ శంకర్, హౌస్ మదర్ హేమ, నైట్ వాచ్‌మన్ నర్సింహ, వంట మనిషి శ్రీమతి, స్వీపర్ లక్ష్మి తదితరులు ఉన్నారు.

పశుగణనను పకడ్బందీగా చేపట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి

కడ్తాల్, ఫిబ్రవరి 6 : జిల్లాలో పశుగణనను అధికారులు పకడ్బందీగా చేపట్టాలని పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పశుగణనపై కచ్చితమైన వివరాలు సేకరించాలని సూచించారు. జీవాలను రక్షించేందుకు సరైన చ ర్యలు తీసుకోవాలన్నారు. పశువుల సంతానోత్పత్తి పద్ధతులను మెరుగుపరచడంపై దృష్టి సారించాలన్నారు. పాడి రైతులకు అందుబాటులో ఉండి వైద్య సేవలను అందించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ లలిత, జీవోఎం సుధాకర్‌గౌడ్, పశు వైద్యాధికారి భానునాయక్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్ర పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

- పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల ఆందోళన
- నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 6 : విద్యార్థి నీరజ్ మృతికి కారణమైన షాద్‌నగర్ పట్టణంలోని శాస్త్ర పాఠశాల గుర్తింపును వెంటనే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని శాస్త్ర పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పునాదులు వేయాల్సిన ఉపాధ్యాయులే వారి ప్రాణాలను తీసుకునేలా వ్యవహరించడం సరి కాదన్నారు. విద్యార్థుల మృతికి కారణమవుతున్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు న మోదు చేయాలన్నారు. ఇలాంటి ఘటనలు పునారావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చ ర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెం టనే విద్యార్థి నీరజ్ మృతికి కారణమైన శాస్త్ర పాఠశాల గుర్తింపు రద్దు చేసి, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఆందోళన చేపట్టిన విద్యార్థి సంఘాల నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించా రు. అనంతరం సొంతపూచికత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షు డు పవన్, నాయకులు ఆకాశ్, సాయి, నరేశ్, అమీర్, సుమేర్, శివ, సాగర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇబ్బందుల్లేకుండా చూస్తున్నా..

ఏదైనా పని ఉంటే సొంత డబ్బుతో వంట మనిషిని ఏర్పాటు చేసి విద్యార్థులు ఇబ్బందుల్లేకుండా చూస్తున్నా. తొమ్మిది నెలల వేతనాలు ఇవ్వాలని అధికారులను అడిగితే చిల్డ్రన్ హోమ్‌ను మరో ప్రాంతానికి మారుస్తామని అంటున్నారు. వేతనాలు సక్రమంగా రాకపోవడంతో కుటుంబం గడవలేని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా ఉన్న తాధికారులు స్పందించాలి.

- శ్రీమతి, వంట మనిషి